సాక్షి ఆదిలాబాద్
ఆదివారం | 3 | ఆగస్టు | 2025

‘ఓపెన్’ ప్రవేశాలు



ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు.
9లో▸

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం..



ఇంద్రవెల్లి మండలం తెజాపూర్ పంచాయతీ పరిధి సాలేగూడలో నీటి సమస్యపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బోర్‌మోటార్‌కు మరమ్మతులు చేపట్టారు.
9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ కొత్త నాటకం

• ఎమ్మెల్యే పాయల్ శంకర్



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: రాష్ట్రంలోని బీసీలంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడుతున్నారని బీసీ రిజర్వేషన్ల పేరిట కొత్త నాటకానికి హస్తం సర్కారు తెరలేపిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీల వ్యతిరేకతను తప్పించుకునేందుకే కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లను తెరమీదకి తీసుకువచ్చారని ఆరోపించారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ కట్టబెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఆ పార్టీకి నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ముస్లింల ప్రస్తావన లేకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసేంతవరకు ఆ పార్టీని బీజేపీ వెంటాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి



వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జీఎం

ఆదిలాబాద్‌టౌన్: వెల్‌నెస్ సెంటర్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ జీఎం డాక్టర్ రాంబాబు నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. సెంటర్‌కు వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మందుల కొరత లేకుండా చర్యలు చేపడతానన్నారు. ఆయన వెంట వైద్యులు రాధిక, శ్రీనివాస్, చంద్రశేఖర్, రత్న తదితరులున్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి



రిమ్స్ డైరెక్టర్‌కు నివేదిక అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: టీబీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లో శనివారం టీబీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జిల్లాలో టీబీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్‌తో పాటు ఆయా విభాగాల వైద్యులతో మాట్లాడారు. దేశంలో టీబీ నివారణ కోసం ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, వైద్యులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతి ప్రక్రియ షురూ


• నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల పదోన్నతి ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. విద్యాశాఖ అధికారులు సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఈ ప్రక్రియ ఈనెల 11 వరకు కొనసాగనుంది. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందే టీచర్ల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చెక్‌లిస్ట్, అన్నిరకాల విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ తదితర పత్రాలు, సర్వీస్ రిజిస్టర్‌తో హాజరు కావాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 3న సీనియారిటీ జాబితాలో అభ్యంతరాల స్వీకరణ, 4,5 తేదీల్లో పరిష్కారం అనంతరం తుది జాబితా విడుదల చేస్తారు. 6న వెబ్ ఆప్షన్లు, 7న పదోన్నతి జాబితా విడుదల, 8,9 తేదీల్లో ఎస్జీటీ ఖాళీల జాబితా విడుదల, 10న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కోసం వెబ్ ఆప్షన్లు, 11న పదోన్నతుల కల్పన ఉంటుంది. జిల్లాలో 144 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్ లభించనుంది. ఇందులో 26 మందికి పీజీ హెచ్‌ఎంలుగా, 118 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



కల్మషం లేనిదే స్నేహం..!

• అమ్మానాన్నల తర్వాత స్నేహితులకే ప్రాధాన్యం • దోస్తులు చాలామందే..• నేడు స్నేహితుల దినోత్సవం



భైంసాటౌన్/ఆసిఫాబాద్/బోథ్/మంచిర్యాల/బెల్లంపల్లి/చెన్నూర్: స్నేహం.. మనసుతో మొదలై మనతో కడవరకూ సాగేది. చదువులో.. ఆటల్లో.. జీవితంలో కలిసి మెలిసి ప్రయాణం సాగించేది. ఎప్పుడు ఎక్కడ మొదలైనా నీడలా సాగుతూనే ఉంటుంది. మంచినీ.. చెడునూ నిర్మొహమాటంగా ఎత్తిచూపి సన్మార్గంలో నడిపిస్తుంది. అందుకే అన్నారు ఓ కవి ‘..శ్వాసగా నిలిచేటిది స్నేహమొకటేనురా..’ తరాలు మారుతున్నా కల్మషం లేని స్నేహం కొనసాగుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ‘సాక్షి’ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా.. కల్మషం లేనిదే స్నేహమని అభిప్రాయం వ్యక్తమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 125 మంది మహిళలు, 125 మంది పురుషులు మొత్తంగా 250 మంది సర్వేలో పాల్గొన్నారు. స్నేహం ఎప్పటికీ కలుషితం కాదని స్పష్టం చేశారు. నేటి తరం తల్లిదండ్రులనూ స్నేహితులుగానే భావిస్తున్నారు. తల్లిదండ్రుల తర్వాత తమ మనసులో స్నేహితులకే మొదటి స్థానమని తేల్చిచెప్పారు. స్నేహం విస్తరిస్తూ స్నేహితుల సంఖ్య పెరిగిపోతుండగా.. నిజమైన స్నేహితుల సంఖ్య ఇద్దరుకు మించి ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

స్నేహబంధం గొప్పది..

• కలెక్టర్ రాజర్షి షా



ఐఐటీ చదివే సమయంలో స్నేహితులతో రాజర్షి షా (ఫైల్)

ఐఐటీ కాన్పూర్‌లో చదివే రోజుల్లో మేం నలుగురం మంచి స్నేహితులుగా ఉండేవాళ్లం. సివిల్స్‌కు సన్నద్ధమైన సమయంలో మా స్నేహం మరింత బలపడింది. ఎలాంటి సందేహాలున్నా ఒకరికొకరం చర్చించుకుని పరిష్కరించుకునేవాళ్లం. మా నలుగురిలో ఇద్దరం ఐఏఎస్‌గా ఎంపికవ్వగా, మరో ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు. విధి నిర్వహణ పరంగా దూరంగా ఉన్నప్పటికీ ఫోన్‌లో మాట్లాడుకుంటాం. యోగాక్షేమాలు అడిగి తెలుసుకుంటాం. శుభకార్యాల్లో కలుస్తూ ఉంటాం. అలాగే నా భార్య, యాపల్‌గూడ 2వ బెటాలియన్ కమాండెంట్, ఐపీఎస్ నితిక పంత్ నా బ్యాచ్‌మెట్. పనిలో, వ్యక్తిగత జీవితంలో నా బెస్ట్ ఫ్రెండ్ కూడా. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలున్నా చర్చించుకుని ముందుకు సాగుతున్నాం. స్నేహబంధం ఎంతో గొప్పది. ఒక మంచి స్నేహితుడు, స్నేహితుల బృందం ఓ వరం. ఒత్తిడిలేని జీవితం గడపడానికి, లక్ష్యసాధనకు దోహదపడుతారనేది నా అభిప్రాయం. – కైలాస్‌నగర్

శిక్షణ నుంచి మంచి స్నేహితులం

• ఎస్పీ అఖిల్ మహాజన్



కలెక్టర్‌తో ఎస్పీ అఖిల్ మహాజన్

2017లో మసూరిలో ట్రెయినింగ్ నుంచి కలెక్టర్ రాజర్షిషా, ఆయన సతీమణి నితిక పంత్ మంచి స్నేహితులం. శిక్షణ అనంతరం ఇతర జిల్లాల్లో పోస్టింగ్ తీసుకున్నప్పటికీ యోగక్షేమాలు తెలుసుకునేవాళ్లం. అప్పుడప్పుడు కలిసేవాళ్లం. ప్రస్తుతం ముగ్గురం ఆదిలాబాద్ జిల్లాలోనే పనిచేస్తున్నాం. ప్రపంచంలో తల్లిదండ్రుల తర్వాత ఏ విషయాన్నైనా పంచుకునేది స్నేహితులతోనే. సంతోష సమయంలోనే కాదు.. కష్టాల్లోనూ తోడుండేవాడే నిజమైన స్నేహితుడు. – ఆదిలాబాద్‌టౌన్

దోస్త్ మేరా దోస్త్

స్నేహం.. ప్రతి ఒక్కరి జీవితంలో విడదీయరాని బంధం. అమ్మానాన్న.. జన్మనిస్తే దానికి సార్థకత చేకూరేలా మెరుగులు దిద్దేది ఫ్రెండే. కష్ట సుఖాల్లో తోడు నిలిచే దోస్తానా మరువలేనిది.. మరిచిపోనిది. హోదాలతో సంబంధం లేని ఆ చెలిమి పరిమళిస్తే పరితపించాల్సిందే. దోస్త్ మేరా దోస్త్ అనాల్సిందే.

- మరిన్ని కథనాలు 8లో▸

ఏటా కలుసుకుంటున్నాం..

• అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



అపూర్వ సమ్మేళనంలో స్నేహితులతో ఎమ్మెల్యే

నా టెన్త్ ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తయింది. మాది 1986–87 బ్యాచ్. అప్పుడు విడిపోయిన మేమంతా ఇరవై ఏళ్ల తర్వాత 2006లో కలుసుకున్నాం. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా మళ్లీ కలుసుకోవడంతో మా స్నేహం తిరిగి చిగురించింది. అప్పటి నుంచి ఏటా వేసవిలో అపూర్వ సమ్మేళనం పేరిట 120 మంది వరకు ఒక్క చోటకు చేరుతున్నాం. కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నాం. హోదాలతో సంబంధం లేకుండా మా ఫ్రెండ్‌షిప్‌ను కొనసాగిస్తున్నాం. రీ యూనియన్ రోజు అన్నీ మరిచిపోతాం. ఆ జ్ఞాపకాలను ఆస్వాదిస్తాం. సృష్టిలో స్నేహ బంధం ఎంతో గొప్పది. నిజమైన స్నేహితులను వదులుకోవద్దు. – నేరడిగొండ

50 ఏళ్ల దోస్తానా..



ఆత్మీయంగా మల్లేశ్, రాజన్న

అవసరాల కోసం స్నేహాలు చేస్తున్న ప్రస్తుత సమాజంలో 50 ఏళ్లుగా ఓ ఇద్దరూ వ్యక్తులు స్నేహానుబంధాన్ని పంచుకుంటూ పలువురికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు. 1970 దశకంలో మొదలైన వారి సోపతి ఇప్పటికీ ఎలాంటి అరమరికలు లేకుండా సాగుతోంది. వారే పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కొమ్ము రాజన్న, తిర్పెల్లి కాలనీకి చెందిన సట్ల అశోక్. వీరి తల్లిదండ్రులు కూడా వీరిలాగే కలిసిమెలిసి ఒకే కుటుంబంలా మెలిగేవారు. ఏ నిర్ణయం తీసుకున్నా ఇద్దరూ కలిసి తీసుకుంటామని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా ఏటా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శివాలయాలు సందర్శిస్తామని, తాము కలవనిదే రోజు గడవదని చెబుతున్నారు. రాజన్న ప్రస్తుతం డీఎస్‌ఏలో వాచ్‌మెన్ విధులు నిర్వహిస్తుండగా, మల్లేశ్ వ్యవసాయం చేస్తున్నాడు. మేము కలిసి చేసిన కష్టమే ఒకరిపై ఒకరికి గౌరవాన్ని పెంచడంతో పాటు బలమైన బంధానికి పునాదులు వేసిందని చెప్పుకొచ్చారు ఈ చెడ్డీ దోస్తులు. – ఆదిలాబాద్

కలెక్టర్‌కు మరో అవార్డు

• రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న రాజర్షి షా



గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నార్నూర్ బ్లాక్‌ను దేశంలోనే ఆదర్శంగా నిలిపిన కలెక్టర్ రాజర్షి షాను ఇప్పటికే జాతీయస్థాయి అవార్డు వరించగా.. తాజాగా రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)సంపూర్ణతా అభియాన్ సమ్మాన్ సమారోహ్ పేరిట ఈ అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసాపత్రం అందజేసి వారు అభినందనలు తెలిపారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, ప్రిన్సిపల్ సెక్రటరీలు జ్యోతి బుద్ధ ప్రకాశ్, దాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొచ్చిన ఆ ముగ్గురు ఐఏఎస్‌లు..

కాగా ఈ వేదికపై గతంలో ఆదిలాబాద్ కలెక్టర్లుగా పనిచేసిన మరో ముగ్గురు ఐఏఎస్‌లు ఉండటం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కె. రామకృష్ణారావు నాడు ఉమ్మడి ఆదిలాబాద్ కలెక్టర్‌గా వ్యవహరించారు. అలాగే జ్యోతిబుద్ధప్రకాశ్, దివ్యదేవరాజన్‌లు సైతం కొత్త ఆదిలాబాద్‌కు కలెక్టర్లుగా వ్యవహరించినవారే. ఆ ముగ్గురూ ఇదే వేదికపై ఉండటం జిల్లావాసులకు గత జ్ఞాపకాలను గుర్తు చేసినట్లయింది. అలాగే సమగ్ర గిరిజన అభివృద్ధిసంస్థ పరిధిలో సేవలందించిన ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

‘ఎఫ్‌ఆర్‌ఎస్’తో సమయపాలన

• బడికి పరుగులు పెట్టిన ఉపాధ్యాయులు



ఫేషియల్ అటెండెన్స్ వేస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: బడులకు డుమ్మా కొట్టే, సమయపాలన పాటించని పంతుళ్లకు చెక్ పడింది. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం) అటెండెన్స్ అమలులోకి వచ్చింది. దీంతో ఉపాధ్యాయులు సమయపాలన పాటించేందుకు పాఠశాలలకు పరుగు పెట్టారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే చేరుకొని ఫేషియల్ అటెండెన్స్ నమోదు వేశారు. ఉదయం 9.05 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు హాజరు వేసుకున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో సర్వర్ డౌన్ కారణంతో ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రక్రియతో ఇష్టారీతిన బడికి వెళ్లే ఉపాధ్యాయుల ఆగడాలు ఇకపై సాగని పరిస్థితి. జిల్లాలో డీఈవో పరిధిలో 691 పాఠశాలలు ఉండగా, 3,288 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరికీ ఫేషియల్ అటెండెన్స్ వర్తింపజేశారు. విద్యార్థులతో పాటు టీచర్లు తమ ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేసుకున్నారు. జిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లేవారు ఇదివరకు బస్టాండ్, తెలంగాణ చౌక్, ఠాకూర్ హోటల్, తాంసి బస్టాండ్‌లలో 9 నుంచి 10 గంటల వరకు కనిపించేవారు. శనివారం ఆ ఉపాధ్యాయులు ఉదయం 8 గంటలకే ఇంటి నుంచి బయల్దేరి నిర్ణీత సమయంలోగానే పాఠశాలలకు చేరుకోవడం గమనార్హం. ప్రభుత్వ నిర్ణయంపై పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్యూఆర్.. జేబుకు చిల్లు!



నా పేరు శివప్రసాద్. ఆదిలాబాద్ వాసిని. శుక్రవారం ఉదయం 11.45 గంటలకు మంచిర్యాల నుంచి ఆ డిపోకు చెందిన బస్సులో ఆదిలాబాద్ బయలుదేరా. కండక్టర్ టికెట్ అనడంతో ఫోన్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ చేస్తానని చెప్పా. ఆయన మిషన్‌లో క్యూఆర్ స్కానర్‌ను చూయించాడు. అందులో రూ.230 టికెట్ ఖరీదు రాగా ఆన్‌లైన్ పేమెంట్ చేశా. డబ్బులు నా అకౌంట్ నుంచి డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అయితే మిషన్‌లో సాంకేతిక సమస్య కారణంగా టికెట్ రాలేదు. దీంతో కండక్టర్ డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవాలన్నాడు. ఆన్‌లైన్ పేమెంట్ తిరిగి వస్తాయని చెప్పాడు. చేసేది లేక డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నాను. శనివారం వరకు కూడా ఆ డబ్బులు జమ కాలేదు. చాలా మంది అవి రావని చెబుతున్నారు.





సాక్షి, ఆదిలాబాద్: ఆర్టీసీ బస్సుల్లో క్యూఆర్ స్కానర్ ద్వారా డబ్బులు చెల్లిస్తున్న ప్రయాణికులకు జేబులకు చిల్లుపడుతుంది. ఆన్‌లైన్ పేమెంట్ అయినా మిషన్ నుంచి టికెట్ రాకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితి. ఒక వేళ ఆ సమయంలో చేతిలో డబ్బులు లేకపోతే దిగిపొమ్మంటూ కండక్టర్లు చెప్పేస్తున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వ మెమో ఆర్టీసీలో నగదు రహిత సౌలభ్యం కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్నా తరచూ ఇలాంటి ఫిర్యాదులు వస్తుండటం గమనార్హం.

ఐ–టిమ్ ద్వారా..

ఆర్టీసీలో నగదు రహిత లావాదేవీలు రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇందుకోసం చలో కంపెనీ నుంచి ఐ–టిమ్ మిషన్లు పంపిణీ చేశారు. ఆదిలాబాద్ రీజియన్‌లో గత ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చింది. ఏసీ బస్సులు మొదలుకుని సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగుల్లోనూ అమలు పర్చారు. రీజియన్ పరిధిలోని ఆయా డిపోల్లో మొత్తం 520 మిషన్లు ప్రస్తుతం పని చేస్తున్నాయి. అయితే అత్యధిక మిషన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫోన్ ద్వారా డబ్బులు స్కాన్ చేస్తున్న ప్రయాణికులకు చుక్కెదురవుతుంది. డబ్బులు అకౌంట్ నుంచి కట్ అవుతున్నా టికెట్ మాత్రం జనరేట్ కావడం లేదు. దీంతో ప్రయాణికులు కండక్టర్లను ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంలో వివాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అంతే కాకుండా సిగ్నల్ వీక్ ఉన్నచోట ఇవి పనిచేయడం లేదనే విమర్శలున్నాయి. అయితే ఆర్టీసీ అధికారులు మాత్రం ఆ డబ్బులు తిరిగి వస్తాయని చెబుతున్నారు.

పరిశీలన చేస్తాం..



టిమ్ మిషన్లపరంగా ప్రయాణికులు వ్యక్తం చేస్తున్న ఈ సమస్యపై పరిశీలన చేస్తాం. ఒకవేళ అకౌంట్‌లో నుంచి డబ్బులు డ్రా అయిన పక్షంలో కండక్టర్లను ఓ నంబర్‌కు స్క్రీన్ షాట్ పెట్టాలని చెప్పాం. తద్వారా 24గంటల్లో ఆ ప్రయాణికులకు డబ్బులు తిరిగి వచ్చేలా చేస్తున్నాం. సాంకేతిక సమస్యలుంటే పరిష్కరిస్తాం.
– భవానీప్రసాద్, ఆర్టీసీ ఆర్‌ఎం

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


దశరథ్

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఉష్కెల దశరథ్ (30) అదృశ్యమయ్యారు. ఎస్సై శ్రీసాయి తెలిపిన వివరాల ప్రకారం.. దశరథ్ కొన్నినెలలుగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్‌లో కూరగాయాలు అమ్ముతూ కుటుంబంతో కలిసి జీవించేవాడు. అతని భార్య శైలజకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో గతనెల 13న స్వంత గ్రామమైన బోథ్‌కు వచ్చాడు. ఐదు రోజుల క్రితం భార్యను నేరడిగొండలోని తన పుట్టింటికి వెళ్లింది. దశరథ్ గతనెల 31న నిర్మల్ వెళ్లి వస్తానని తల్లి లక్ష్మితో చెప్పి వెళ్లాడు. రెండు రోజులైన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికిన దొరకలేదు. భార్య శైలజ ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి మృతికి కారకుడి అరెస్ట్


వెల్లడిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: యువకుడి మృతికి కారకుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. స్థానిక వెంకటాద్రిపేట్ కాలనీకి చెందిన సల్ల అభిలాష్ తన స్నేహితుడితో కలిసి గతనెలలో స్కూటీపై వెళ్తున్నాడు. బంగల్‌పేట్ కాలనీకి చెందిన బైండ్ల స్వామి మద్యం మత్తులో బైక్ నడుపుతూ ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టాడు. ప్రమాదంలో అభిషేక్ తీవ్రంగా గాయపడి, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేసి బైండ్ల స్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మట్కా ఆడుతున్న 8 మంది అరెస్ట్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని గాంధీ పార్క్ సమీపంలో మట్కా ఆడుతున్న 8 మందిని శనివారం పట్టుకుని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5240 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఎవరైనా మట్కా ఆడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

కడెం ప్రాజెక్ట్‌లో దూకిన యువకుడు

- కాపాడిన టూరిజం సిబ్బంది


యువకుడిని కాపాడుతున్న సిబ్బంది

కడెం: మండల కేంద్రానికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్ట్ కుడి కాలువలో దూకాడు. స్థానికుల సమాచారంతో టూరిజం(బోటింగ్) సిబ్బంది హుటాహుటిన వెళ్లి తాడు సహాయంతో యువకుడిని రక్షించారు. యువకుడు ప్రాజెక్ట్‌లో ప్రమాదవశాత్తు పడిపోయాడా, ఆత్మహత్య కోసం దూకాడనేది తెలియరాలేదు. ఈ విషయమై ఎస్సై సాయికిరణ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, మద్యం మత్తులో దూకి ఉంటారనే అనుమానం ఉందని పేర్కొన్నారు.

దోస్త్.. మేరా దోస్త్

- ఆత్మీయ బంధాల సౌరభం స్నేహం
- కష్టసుఖాల్లో తోడుండేవాడు మిత్రుడు
- నిజమైన మిత్రులే గొప్ప ఆస్తి
- నేడు స్నేహితుల దినోత్సవం



ఆస్తులు సంపాదించినవాడు కాదు, ఆప్తులను సంపాదించినవాడే నిజమైన అదృష్టవంతుడు. స్నేహితుడు.. ఎవరి సమక్షంలో బాధలు సగానికి సగమై, ఆనందం రెట్టింపవుతుందో, ప్రపంచంలో ఎవరూ విడిచిపెట్టినా నీవు ఒంటరి కాకుండా తోడుంటారో, వారే నిజమైన మిత్రులు. స్వచ్ఛమైన స్నేహం ఒక అపురూప దివ్యమణి, హృదయాలను అనుసంధానం చేసే ఆత్మీయ వారధి. ఆధునిక కాలంలో యాంత్రిక జీవనం, ఆర్థిక సంబంధాల మధ్య స్వార్థం లేని స్నేహం కోసం తపించే హృదయాలెన్నో.. అయినా, చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం, గత జ్ఞాపకాలు నెమరువేసుకోవడం ఆ హృదయాలకు ఊరటనిస్తుంది. సాంకేతికత స్నేహబంధాలకు కొత్త ఊపిరి పోసింది. ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాలు దూరమైన మిత్రులను దగ్గర చేశాయి. ట్రెండ్ మారినా.. నిజమైన ఫ్రెండ్ మారలేదు. నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆప్తమిత్రులపై ప్రత్యేక కథనం.

ఈ బంధం విడదీయలేనిది


స్నేహితులు తోట రాము, పిప్పెర కృష్ణ

భైంసా: పట్టణానికి చెందిన పిప్పెర కృష్ణ, తోట రాము 40 ఏళ్లుగా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు. తానూరు మండలం బోసి గ్రామానికి చెందిన పిప్పెర గజ్జారాం భైంసాకు వచ్చి స్థిరపడ్డాడు. భట్టిగల్లిలో పెరిగిన పిప్పెర కృష్ణ, తోట రాముతో కలిసి చదువుకున్నాడు. క్రికెట్ ఆడుతూ యువజన సంఘం ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు కొనసాగించాడు. భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన పిప్పెర కృష్ణ తన చిన్ననాటి స్నేహితుడు తోట రామును మరిచిపోలేదు. పట్టణంతోపాటు చుట్టూపక్కల ఏ పని ఉన్న ఇద్దరు మిత్రులు కలిసే వెళ్తారు. ఈ స్నేహబంధం ఇప్పటికి ఎవరు విడదీయలేనిది.

ఆపదలో అండగా 'సోపతిమిత్ర'

నెన్నెల: నెన్నెల మండలం చిన్నవెంకటాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ తన ఆలోచనతో సోపతి వెల్ఫేర్ సొసైటీకి పునాది వేశారు. జైపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి వరకు చదువుకున్న మిత్రులు రాజబాబు, సాంబశివ, రాచర్ల శ్రీనివాస్, నీలాల శ్రీనివాస్, కృష్ణ, రవికిషన్, నారాయణ, తిరుపతితో కలిసి మొత్తం 110 మంది స్నేహితులతో ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. మిత్రులకు ఏ ఆపద వచ్చిన అందరూ కలిసి వాట్సాప్ గ్రూపుల్లో చర్చించుకుని వారి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఐదేళ్ల నుంచి ఇప్పటివరకు రూ.6 లక్షలకుపైగా ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు రక్తదానం, రక్తహీనతతో బాధపడుతున్న తలసేమియా బాధితులకు రక్తం కావాలన్నా మేమున్నామంటున్నారు. పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆర్థికసాయం అందిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు.


గాయపడిన మిత్రుడికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

రెండేళ్లకోసారి గెట్ టు గెదర్


స్నేహితులు దేవేందర్‌రావు, రవీందర్‌రెడ్డి, ఓదెలు

చెన్నూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో దేవేందర్‌రావు (ప్రస్తుత చెన్నూర్ సీఐ) ఐదో తరగతి చదువుతున్నప్పుడు మిల్కూరి రవీందర్ రెడ్డి, మొర్రె ఓదెలు స్నేహితులు. ఓదెలు ప్రజాప్రతినిధి కాగా, రవీందర్‌రెడ్డి స్వగ్రామంలో వ్యవసాయం చేస్తున్నాడు. వీరి స్నేహం 30 ఏళ్లకు పైగా కొనసాగుతోంది. ఎక్కడ ఉన్నా శుభ కార్యాల్లో ముగ్గురు కలిసి వెళ్తారు. రెండేళ్లకోసారి గెట్ టూ గెదర్ ఏర్పాటు చేసి చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకుంటారు.

ఏడో తరగతి నుంచి..


స్నేహితులు శ్రీనివాస్, గజ్జారాం

భైంసా: 7వ తరగతి గదిలో ప్రారంభమైన స్నేహబంధాన్ని పట్టణానికి చెందిన లాగేట్‌వార్ శ్రీనివాస్, పల్సి గజ్జారాంలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సాయిబాబానగర్‌కు చెందిన శ్రీనివాస్ డిజిటల్ సౌండ్ సిస్టం షాప్ ఉండగా, పల్సి గజ్జారాం ఆటో నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులకు కష్టాలు వచ్చినా ఇద్దరు కలిసి చర్చించుకుంటారు. 27 ఏళ్లుగా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు.

30 ఏళ్లుగా..


చిరకాల స్నేహితులు నిఖిల్, గణేశ్

భైంసా మండలం తిమ్మాపూర్‌కు చెందిన అనంతుల నిఖిల్ ముద్దోళ్ల గణేశ్ చిన్నతనం నుంచే స్నేహితులు. గణేశ్ భైంసాలో సీడ్స్, ఫర్టిలైజర్ షాప్ ఉండగా, నిఖిల్ భైంసాలోని నిఖిల్ రెస్టారెంట్ నడుపుతున్నాడు. 30 ఏళ్లుగా స్నేహం కొనసాగుతూనే ఉంది. రోజు ఇంటి నుంచి కలిసి వచ్చి తిరిగి కలిసే ఇంటికి వెళ్తారు.

కష్టసుఖాల్లో తోడునీడగా..


ఆత్రం వామన్, షేక్ సలీం(ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలం మాండగడలో ఆత్రం వామన్ (జూనియర్ అసిస్టెంట్), షేక్ సలీం (ఆర్ఎంపీ) మూడో తరగతిలో స్నేహం మొదలైంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఆత్రం వామన్ పలు సందర్భాల్లో షేక్ సలీం ఇంట్లో అన్నం తిని పాఠశాలకు వెళ్లేవాడు. తన స్నేహానికి కులం అడ్డు రాదని ఆ గ్రామంలో కృష్ణాలయం నిర్మాణ సమయంలో షేక్ సలీం రూ.25 వేలు విరాళంగా అందించారు. హిందువుల పండుగల వేళ షేక్ సలీం కుటుంబ సభ్యులతో కలిసి వామన్ ఇంటికి వస్తారు. ముస్లిం పండుగలు ఉన్నప్పుడు వామన్ కుటుంబ సభ్యులతో సలీం ఇంటికి వెళ్తారు. 43 ఏళ్లుగా ఒకరికొకరు కష్టాల్లో పాలుపంచుకుంటూ తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు.

సేవల్లో టాప్


ముద్గల్‌లో మొక్కలు నాటుతున్న స్నేహితులు

ముధోల్ మండలం ముద్గల్ గ్రామానికి చెందిన యువకులంతా సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటున్నారు. గ్రామానికి చెందిన స్నేహితులంతా ఒకే చోట కలిసి అభివృద్ధిని కొనసాగిస్తున్నారు. జాతీయ రహదారికి 3 కి.మీ దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామంలో స్నేహితులంతా కలిసి శ్రమదానంతో రోడ్లు వేశారు. యువ భారత్ ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. స్వయం ఉపాధితో కుటుంబాలను పోషించే ఈ స్నేహితుల బృందం ముద్గల్ గ్రామ అభివృద్ధికి పాటుపడుతోంది.

19 ఏళ్లుగా స్నేహబంధం



ఆదిలాబాద్‌టౌన్: నేను 2006లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా చేరాను. ఆ సమయంలో నా స్నేహితురాలు మంజుల కెమిస్ట్రీ లెక్చరర్‌గా పరిచయమైంది. అప్పటి నుంచి మా స్నేహం ముడిపడింది. కళాశాలలో నాలుగేళ్లు పనిచేశాం. 2013లో నేను మహిళా డిగ్రీ కళాశాలకు పదోన్నతిపై వెళ్లగా, నా స్నేహితురాలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వెళ్లారు. ఆ తర్వాత నేను ఉట్నూర్‌కు బదిలీపై వెళ్లగా, ఆమె లక్సెట్టిపేట్ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. అయినప్పటికీ మా స్నేహబంధం కొనసాగుతోంది. 14 ఏళ్ల తర్వాత మళ్లీ ఆమె డిగ్రీ కళాశాలలో ఉండడంతో నేను అదే కళాశాలను ఎంచుకున్నాను. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. ఇరు కుటుంబ సభ్యులు కష్టసుఖాల్లోనూ పాలు పంచుకుంటాం. 19 ఏళ్లుగా మా స్నేహం కొనసాగుతుంది.

– సంగీత, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

స్నేహం వారి బలం


తొమ్మిది మంది మిత్రులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరికి చెందిన తిరుపతి గిత్తే, రమేశ్ పురి, రాజు పాతాడే, సుదగొనేవార్ మాధవ్, రాథోడ్ సుదర్శన్, తిరుపతి కాగ్నే, విష్ణు కేంద్రె, రాజు చోళే, బాలు తిడికే స్నేహితులు. వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చినా, మనస్సులు ఒక్కటయ్యాయి. ప్రతీ పనిలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ప్రతీ పండుగలో ఒక్కటై అన్ని తామే నిర్వహిస్తారు. కొందరు వ్యాపారులు, మరికొందరు విద్యావంతులుగా ఉన్నారు. ఏళ్లుగా ఒకే మాట.. ఒకే బాటపై నడుస్తున్న తొమ్మిదిమంది మిత్రులు స్నేహమేరా జీవితమంటూ తెలియజేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటున్నారు.

మతాలు వేరైనా..


స్నేహితులు శ్రీకాంత్, అశ్వక్

తాంసి: తాంసికి చెందిన జానకొండ శ్రీకాంత్, వడ్డాడి గ్రామానికి చెందిన అబ్దుల్ అశ్వక్ 6వ తరగతి చదువుతున్నప్పుడు స్నేహితులయ్యారు. 30 ఏళ్లుగా స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. మతాలు వేరైన ఇళ్లలో జరిగే శుభకార్యాలు, కష్టసుఖాల్లో రెండు కుటుంబాలు పరస్పరం కలుసుకుంటాయి. ప్రస్తుతం చేస్తున్న వ్యాపారాల్లో ఒకరికొకరు పనులు చేసుకుంటారు.

దోస్తులంతా ఉద్యోగులే


చిన్ననాటి మిత్రులు

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రులు ఒకే చోట విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 1 నుంచి 10వ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి 1999లో 10వ తరగతి పూర్తిచేశారు. ఉన్నత చదవులు చదవి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. బి.సుధాకర్ (ప్రభుత్వ టీచర్), పి.గంగాధర్ (సాఫ్ట్‌వేర్), ఎల్.దత్తాత్రి (పీఈటీ టీచర్), ఎ.రాజేశ్వర్ (ఆరోగ్యమిత్ర)గా కొనసాగుతున్నారు.

మెడికో.. స్నేహ వారధి..

- వైద్య విద్యార్థుల ఫౌండేషన్
- ప్రతీనెల సేవా కార్యక్రమాలు
- స్నేహాన్ని పెంపొందించుకునేలా కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల సేవాగుణం పలువురికి స్ఫూర్తినిస్తోంది. చేయూతనందిస్తోంది.విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పుతోంది. కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.సులేమాన్ ఆధ్వర్యంలో గవర్నమెంటు మెడికల్ కాలేజీ ఫౌండేషన్, మంచిర్యాల పేరిట ఏర్పాటైంది. 2002లో మొదలైన మెడిసిన్ మొదటి బ్యాచ్ ఆరంభ్, 2023లో ఆరోహణ, 2024 బ్యాచ్ అద్వితీయగా నామకరణం చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి నెలకు రూ.100 చొప్పున జమ చేసి ఐదు లక్ష్యాలు ఆర్థిక సహాయం, పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, సోషల్ అవేర్‌నెస్‌లను ఎంచుకుని సహాయం అందిస్తున్నారు. మార్చి నుంచి జూలై వరకు లక్ష్యాలను పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చిలో పేద మెడిసిన్ విద్యార్థికి మూడో సంవత్సరానికి హాస్టల్, కాలేజీ ఫీజు చెల్లించారు. మంచిర్యాలలోని బాలికల పాఠశాల విద్యార్థినులకు న్యాప్‌కిన్స్ అందించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కల్వరి వృద్ధాశ్రమం, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన దివ్యాంగులు ఇద్దరికి రెండు ట్రైసైకిళ్లు అందించారు.


మంచిర్యాల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాప్‌కిన్స్ పంపిణీలో మెడికోలు(ఫైల్)

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సోయం బాపూరావు

- రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి జిల్లాలో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుమురం భీం జిల్లాలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభకు జాతీయ, రాష్ట్ర, అన్ని ఆదివాసీ తెగలు, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఆదివాసీలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్ రావు, కుమ్ర శ్యామ్ రావు, జంగు పటేల్, శేష్‌రావు, సునీల్, రాజు, ఉపేందర్, హన్ను పటేల్, విజయ్, మనోహర్, మారుతి, మాణిక్ రావు, సూర్యబాన్, చిత్రు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీస్ ఇన్‌చార్జి టి.ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్‌కు చెందిన సాయినాథ్ సుంగుర్వాడ్ (40) గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. శనివారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫాం–1 రైలు పట్టాలపై తలపెట్టాడు. ఆదిలాబాద్ నుంచి పర్లి వెళ్లే ప్యాసింజర్ రైలు వెళ్లడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడలో శనివారం సాయంత్రం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణంలోని బెస్తవాడకు చెందిన ముగ్గురు.. కాలనీ మీదుగా వెళ్తుండగా, కుక్క కరిచింది. వెంటనే స్థానిక ప్ర భుత్వాసుపత్రిలో చికిత్స పొందారు.

బాలింతకు దారి కష్టాలు

- 2 కి.మీ కాలినడకతో ఇంటికి..


పసికందుతో వాగుదాటుతున్న బాలింత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామస్తులకు వర్షాకాలంలో దారి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో రెండుచోట్ల వాగులు ప్రవహిస్తాయి. వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఆడ లక్ష్మి ఆదిలాబాద్ ఆస్పత్రిలో ప్రసవమై డిశ్చార్జి ఇంటికి పయనమయ్యారు. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక బాలింత 2 కి.మీ పసికందుతో కాలినడకన వెళ్లారు. రోడ్డు సౌకర్యం, వాగులపై వంతెనలు లేక అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

మానవత్వం చాటుకున్న కార్మికులు

- గాయపడ్డ ఎద్దుకు చికిత్స


ఎద్దును సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని కార్మికులు మానవత్వం చాటుకున్నారు. రోడ్డు పక్కన గాయాలతో మూలుగుతున్న ఎద్దును చూసి దానికి సపర్యాలు చేసి సంరక్షణ కేంద్రానికి తరలించారు. వర్క్‌షాప్ నుంచి ఆర్కే 7 గనికి వెళ్లేదారిలో మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వాహనం ఓ ఎద్దును ఢీకొట్టి గాయపర్చింది. కాళ్లకు తీవ్ర గా యమై రక్తస్రావం జరగడంతో కదలకుండా అక్కడే పడి ఉంది. శనివారం ఉదయం డ్యూటీకి వెళ్లే కార్మి కులు గమనించి రామకృష్ణపూర్‌కు చెందిన పశుసంరక్షణ కేంద్ర నిర్వాహకులు శ్రీధర్, రాజసమ్మయ్య సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకో గా దాన్ని తరలించడం ఇబ్బందిగా మారింది. కా ర్మికులు.. ఏజెంట్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌కు చెప్పడంతో ఆయన ఆదేశాలతో ఏరియా వర్క్‌షాప్ డీజీఎం రవీందర్ క్రేన్, వాహనాన్ని సమకూర్చారు. ఎద్దును లారీలో ఎక్కించి సంరక్షణ కేంద్రానికి తరలించి వైద్యం అందిస్తున్నారు. గని కార్మికులు మారుపల్లి సారయ్య, నాగరాజ్, రాజ్‌కుమార్, చిలుక రమేశ్ పాల్గొన్నారు.